క్లుప్తంగా

పాల ఆటోను ఢీకొన్న బైకు

● ఒకరికి గాయాలు



సంఘటన స్థలంలో పాల ఆటో, బైకు

దర్శి (కురిచేడు): మండలంలోని పోతవరం వద్ద పాల ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. తానంచింతల నుంచి పాల క్యాన్లతో దర్శి వైపు వస్తున్న ఆటోను తానంచింతలకు చెందిన కోటేశ్వరరావు బైకు పోతవరం సమీపంలో ఢీకొట్టింది. కోటేశ్వరరావుకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడికి దర్శిలోని ప్రైవేటు వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసిన వైద్యులు.. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేట తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

కేజీబీవీ పరిశీలన



టీచర్లతో మాట్లాడుతున్న జీసీడీఓ హేమలత

కురిచేడు: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీఓ కె.హేమలత, సీఎంఓ సోనీరూత్ బుధవారం పరిశీలించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల స్టడీ అవర్లు ఎలా జరుగుతున్నాయి? విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించారు. మెనూను పరిశీలించారు. భోజనం రుచి చూశారు. ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ముండ్లమూరు, దర్శి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను కూడా పరిశీలించినట్లు ఆమె తెలిపారు.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఖాళీ ట్యాంకును పరిశీలిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఒకటో సచివాలయంలో బుధవారం డ్రైడే నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సబ్ యూనిట్ అధికారి రమేష్‌బాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలంగా నీరు నిల్వ ఉంటే మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికున్ గున్యా తదితర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. మలేరియా సూపర్‌వైజర్ ఇజ్రాయేల్, ఆరోగ్య కార్యకర్త నాగలక్ష్మి, ఆశా కార్యకర్త ప్రావీణ్యం పాల్గొన్నారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలి



ఎమ్మార్సీలో ఫిజియోథెరపీ

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లోని దివ్యాంగ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని దివ్యాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ఇందిర అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో జరిగిన ఫిజియోథెరపీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి ఎంఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పని సరిగా వారంలో ఒక్క రోజు జరిగే కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. దీన్ని బాధ్యతగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తీసుకోవాలని చెప్పారు. దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీతో అనేక ఉపయోగాలు ఉన్నాయని, వాటిని గమనించి ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ ఆంకారావు, ఐఈఆర్టీ తేజరూపిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కంది పోయింది!

● అప్పుల బాటలో అన్నదాతలు



ఆరబోసిన కందులు

కురిచేడు: వ్యవసాయ సీజన్‌లో రైతులకు తక్కువ పెట్టుబడితో లాభాలు ఆర్జించి పెట్టే పంట కంది. అంతే కాదు ప్రజలకు నిత్యం అవసరమయ్యే పోషకాహారం కూడా అదే. ఆ పంట ఈ ఏడాది రైతులకు కందిపోయేలా చేసింది. పెట్టిన పెట్టుబడులు కూడా రాకుండా పప్పు అప్పులపాలు చేసింది. మండలంలో సుమారు 12,320 ఎకరాల్లో కంది పంటను సాగు చేశారు. అందిన కాడల్లా అప్పులు చేసి పంటను పండించారు. ఎకరానికి సుమారు రూ.25 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. పంటను చూసి రైతులు ఎన్నో ఆశలు పెంచుకున్నారు. వరుణుడు, ప్రకృతి ప్రకోపించాయి. కంది పంట పండే సమయానికి కారుమబ్బులు, గూడ మంచుతో కంది పూత నేలరాలిపోయింది. రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఎకరానికి సుమారు 9 నుంచి 10 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందనుకున్న రైతులకు కేవలం 1.5 నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి వచ్చేసరికి కనాకష్టమైంది. దీంతో ఏడాది పొడవునా చేసిన కష్టం బూడిదలో పోసిన పన్నీరైంది. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగి రైతులు అప్పులపాలయ్యారు. గత ప్రభుత్వంలో రైతులకు పంటల సాగుబడి సమయానికి రైతు భరోసా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకునేది. ఈ ఏడాది అది కూడా లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారుల వద్ద వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టడంతో రైతులు అప్పుల పాలు కావాల్సి వచ్చింది. గిట్టుబాటు ధర లేక రైతులు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గతంలో క్వింటా రూ.10 వేల వరకు ప్రభుత్వం రైతు మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేసేది. కానీ ఈ ఏడాది కందుల దిగుబడితో పాటు గిట్టుబాటు ధర కూడా సగానికి పడిపోయింది. క్వింటా కేవలం రూ.6 వేల నుంచి రూ.6500 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడిలో సగం కూడా రాకపోవడంతో రైతులు అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులు ఎలా తీర్చాలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడుల వడ్డీలు కూడా రాలేదు



ఈ ఏడాది కంది పంటకు పెట్టిన పెట్టుబడి వడ్డీకి కూడా కందులు పండలేదు. గతంలో దిగుబడి పెరిగింది. గిట్టుబాటు ధర కూడా లభించడంతో పాటు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడం ద్వారా వడ్డీల భారం లేదు. ఈ ఏడాది ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వలేదు. గిట్టుబాటు ధర కూడా ఇవ్వక పోవడంతో అప్పుల పాలయ్యాం.

– నుసుం ఎల్లారెడ్డి, రైతు

దిగుబడి, ధర తగ్గింది



గతేడాది వరకు వర్షాలు సక్రమంగా పడి పండదనుకున్న పంటలు కూడా బాగా పండాయి. అనుకున్న దానికంటే ఎక్కువ దిగుబడులు వచ్చాయి. దానిక తోడు అప్పు చేసే పరిస్థితి లేకుండా ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకుంది. గిట్టుబాటు ధర కూడా ఆశాజనకంగా ఉంది. ఈ ఏడాది ప్రభుత్వం ఆదుకోలేదు. పెట్టుబడులు పెరిగాయి. గిట్టుబాటు ధర లేదు. కనీసం పంటల బీమా కూడా ప్రభుత్వం చెల్లించలేదు. రైతులకు ఆసరా ఎక్కడ నుంచి వస్తుంది. అన్ని విధాలా నష్టపోయా.

– నుసుం చిన వెంకటరెడ్డి (బుజ్జి)

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న హేమలత

ముండ్లమూరు (కురిచేడు): మహిళలు తమ రక్షణ చట్టాలు, హక్కుల గురించి అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా ట్రెనింగ్ కో ఆర్డినేటర్ ఎం.హేమలత పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వ పథకాలపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఏరియా కో ఆర్డినేటర్ తప్పెట డేవిడ్ అధ్యక్షతన బుధవారం అవగాహన కల్పించారు. కో ఆర్డినేటర్ హేమలత మాట్లాడుతూ బాల్యంలో ఆడబిడ్డలకు వివాహాలు చేయరాదని, ప్రతి మహిళ తల్లిగా, భార్యగా, బిడ్డగా ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్న దేశంలో ఆడపిల్లలను రక్షించుకునేందుకు నేటికీ చట్టాలపై ఆధార పడాల్సి రావడం దురదృష్టకరమన్నారు. నేటి సమాజ అభివృద్ధిలో స్త్రీపాత్ర ఎంతో ముఖ్యమైందని కొనియాడారు. ప్రతి మహిళా అభివృద్ధి ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందినప్పుడే మన కుటుంబాలు, సమాజం అభివృద్ధి చెందుతుందని మండల వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కె.కోటేశ్వరరావు పేర్కొన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం గురించి, గృహ హింస వ్యతిరేక చట్టం, మహిళల ఆరగ్య భద్రత, మహిళలను శారీరకంగా, మానసికంగా బాధించడం, వరకట్నం కోసం డిమాండ్ చేయడం, లైంగిక వేధింపులకు గురిచేయడం, మగ పిల్లలను కనాలని చెప్పటం నేరమని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి టి. శాంతిప్రియ తెలిపారు. సమాజాభివృద్ధిని ఆ సమాజంలో మహిళల అభివృద్ధితో లెక్కిస్తారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్న మాటలను డీబీఆర్సీ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు గుర్తుచేశారు. మహిళలు లేని సమాజాన్ని ఊహించటం సాధ్యం కాదన్నారు. అలాంటి ఈ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్షత హేయమన్నారు. ఆడబిడ్డ పెళ్లి కోసం కాదు.. చదువు కోసం అని ప్రతి తల్లిదండ్రులు గుర్తెరగాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మహిళలు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ముండ్లమూరు (కురిచేడు): ఒంగోలులోని డీఈఓ కార్యాలయం ఎదుట ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఏపీటీఎఫ్ సబ్ కమిటీ సమావేశం మండల శాఖ అధ్యక్షుడు టి.శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ఉపాధ్యాయుల దీర్ఘకాలిక, వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలపై జిల్లా విద్యాశాఖాధికారికి మూడు నెలలుగా రెండు సార్లు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోలేదన్నారు. సాచివేత ధోరణి అవలంభిస్తూ కాలయాపన చేస్తున్నారని, ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి సర్వీస్ రెగ్యులైజేషన్, ప్రొఫెషన్ డిక్లరేషన్, 2008 తెలుగు పండిట్ల సీనియారిటీ జాబితా, 1998, 2002, 2014 ఎస్టీటీ సినియారిటీ జాబితాలు ఇవ్వాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ధర్నాలో ఏపీటీఎఫ్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి జి.ఎలిషా, జిల్లా ఉపాధ్యక్షుడు లేవి ప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ సీహెచ్ పద్మావతి, కె.శ్రీనివాసరావు, ఆరె శ్రీనివాసరావు, రుద్రయ్య, కృష్ణనాయుడు, దార్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు సాధ్యం



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న డీఈఓ కిరణ్‌కుమార్

పుల్లలచెరువు: విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటేనే ఉన్నత శిఖరాలు చేరుకునేందుకు సాధ్యం అవుతుందని రిటైర్డ్ సైనికుడు డి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని మురుకిమళ్ల గిరిజన ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు బుధవారం పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ముఖ్యంగా ప్రతి పదో తరగతి విద్యార్థి పరీక్షలు వస్తున్నాయని ఒత్తిడికి లోనుకాకుండా ఉండాలన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను రోజూ రివిజన్ చేసుకుంటూ ఏకాగ్రతతో చదువుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు చేరుకోవాలంటే పదో తరగతి మొదటి మెట్టుగా ఉంటుందని, నేడు బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, బాగా చదువుకుంటే అనేక రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి తప్పని సరిగా క్రమశిక్షణతో విద్యను అభ్యసించినప్పుడే మంచి భవిష్యత్‌కు మార్గాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. 2025 పరీక్షల్లో 500 కంటే ఎక్కువ మార్కులు వచ్చిన ప్రతి విద్యార్థికి రూ.1116 నగదు బహుమతిగా అందజేస్తానని ప్రకటించారు. హెచ్‌ఎం బయ్యన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో మంచి ఫలితాలు

తాళ్లూరు: ఏకాగ్రతతో విద్యను అభ్యసిస్తే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. బుధవారం స్థానిక వీకేజీహెచ్ స్కూల్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం రెండు రోజులుగా జరుగుతున్న జ్ఞాన జ్యోతి కార్యక్రమానికి హాజరయ్యారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధతో శిక్షణ తరగతుల్లో పాల్గొని విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధి పెరుగుదలకు తోడ్పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఈఓ-1 సుబ్బయ్య, ఎంఈఓ-2 సుధాకర్‌రావు, వీకేజీహెచ్ఎస్ హెడ్ మాస్టర్ శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోతి, డీఆర్పీలు శివరామిరెడ్డి, శ్రీమన్నారాయణ, చంద్రిక పాల్గొన్నారు.

ఎంపీపీ గుమ్మా పద్మజ ఆర్థిక సాయం

పెద్దదోర్నాల: మండల పరిధిలోని చిన్నదోర్నాల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఎంపీపీ గుమ్మా పద్మజ 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మా పద్మజ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండ్లా శ్రీనివాసులుకు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా శాతరాజుపల్లె వెంకటరావు రూ.6 వేలు, రావిళ్ల కోటేశ్వరరావు రూ.5 వేలు అందజేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుబ్బారావు, పాలకిటి శ్రీనివాసరావు, గాదె కాశీరావు పాల్గొన్నారు.

శివాజీకి ఘన నివాళి



శివాజీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

కురిచేడు: భారత మాత ముద్దుబిడ్డ ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విదేశీ శక్తులను ఎదుర్కొని భారతీయతను చాటి చెప్పిన గొప్ప యోధుడు ఛత్రపతి శివాజీ అని వక్తలు కొనియాడారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. జే.సత్యనారాయణ, ప్రసాద్, అయ్యప్పశెట్టి, నాగేశ్వరరావు, కిషోర్, చెన్నకేశవులు, రోసిరెడ్డి, పెద్ద కాశిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎం.ఆంజనేయులు, ఎస్.నాసరయ్య గుప్తా, సుధాకర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు ఉత్సాహంగా ఉండాలి



అంగన్‌వాడీలతో ఎంఈవోలు ఆంజనేయులు, మల్లూ నాయక్

యర్రగొండపాలెం: అంగన్‌వాడీ కార్యకర్తలు తమ కేంద్రాల్లో చిన్నారుల ఎదుట ఉత్సాహంగా ఉంటే వారు కూడా ఆనందంగా తమకు దగ్గరవుతారని ఎంఈవోలు పి.ఆంజనేయులు, మల్లూ నాయక్ అన్నారు. జ్ఞాన జ్యోతి కార్యక్రమాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు ఆటపాటల ద్వారా చిన్నారులకు దగ్గరయ్యే అవకాశం ఉంటుందని, వారికి విద్యను బోధించ వచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు లక్ష్మీనారాయణ, మల్లికార్జునరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మజ, సుజాత, సీఆర్ఎంటీలు మూర్తి, దుర్గారావు, కోటేశ్వరరావు, ఎల్లయ్య, వినయ్ పాల్గొన్నారు.

స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్ బాధ్యులందరిపై చర్యలు తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

● దళిత సంఘాల డిమాండ్

యర్రగొండపాలెం: ఖరీదైన స్థలాల అక్రమ రిజిస్ట్రేషన్‌కు సహకరించిన వారందరిపై చర్యలు తీసుకోవాలని బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళిత సంఘాల నాయకులు ఆందోళన చేశారు. మార్కాపురం రోడ్డులోని ఎస్సీ బాలికల వసతి గృహం ఎదురుగా ఉన్న రూ.5 కోట్ల విలువ చేసే రోడ్లు, భవనాల శాఖ, ఇతరులకు చెందిన స్థలాలను గత నెలలో మండలంలోని సర్వాయపాలేనికి చెందిన ఒకరు తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించిన విషయం విదితమే. స్థలదారులు కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆమె మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ విచారించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ నివేదిక మేరకు తహసీల్దార్ బాల కిషోర్, వీఆర్వో-2 ఎల్లయ్య, సర్వేయర్ దిలీప్‌లను మంగళవారం కలెక్టర్ సస్పెండ్ చేశారు. సస్పెండైన వారంతా దళితులేనని, ఈ స్థలాలు రిజిస్ట్రేషన్ అయ్యేందుకు వారితో పాటు మరో ముగ్గురు అగ్రకులాలకు చెందిన అధికారులు ఉన్నారని, వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. వెంటనే ఈ ఘటనపై సమగ్రంగా విచారించి మిగిలిన వారిపై కూడా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గర్నెపూడి వినయ్, దళిత నాయకులు రాచేటి ప్రసాదరావు, ఆడిపి సుందర్‌కుమార్, మెడబలిమి చెన్నకేశవులు, తూమాటి వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాసులు, బొప్పూరి అబ్రహం, రాజు, నాసరయ్య, సుభానీ పాల్గొన్నారు.

భవిత సెంటర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న నాగేంద్రనాయక్

కురిచేడు: స్థానిక ఎస్ఎస్పీ కాలనీలోని భవిత సెంటర్‌ను జిల్లా ఐఈ కో ఆర్డినేటర్ పి.నాగేంద్ర నాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్యాబ్‌లు ఉపయోగించి ఐఈఆర్టీలు విద్యను బోధించడం చూసి సంతోషించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆ తర్వాత ఎస్ఎస్పీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఐఈఆర్టీలు కె.సురేష్ పాల్గొన్నారు.

ఆ తవుడులో హానికర పదార్థాలు లేవు



తవుడుపై వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ముండ్లమూరు (కురిచేడు): మండలంలోని వేంపాడు వద్ద ఓ రైస్ మిల్లులో నిల్వ చేసిన తవుడులో ఎలాంటి హానికర పదార్థాలు లేవని ఒంగోలు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నవరపు రమేష్‌బాబు, దర్శి ఏడీఏ పురుషోత్తమరాజు తెలిపారు. ఈ నెల 10వ తేదీన వేంపాడు రైస్ మిల్లులో హానికర పదార్థాలు కలిసిన తవుడు అమ్ముతున్నారని ఓ అపరిచిత వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడు. దానిపై విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి బుధవారం రైస్ మిల్లును తనిఖీ చేసినట్లు వారు తెలిపారు. రైస్ మిల్లులో 900 బస్తాల తవుడు, మరో 10 బస్తాల తెల్లపొడిని గుర్తించామన్నారు. ఆ రెండింటి శాంపిల్స్ తీసి పరీక్షల కోసం వీబీఆర్ఐ విజయవాడ ల్యాబ్‌కు పంపించామన్నారు. ఈ నెల 18వ తేదీన ఆ తవుడులో ఎలాంటి హానికర పదార్థాలు లేవని ల్యాబ్ రిపోర్టు వచ్చిందని తెలిపారు. అధికారులు సీజ్ చేసిన గదిని వీఆర్వో కె.దయానందం సమక్షంలో మిల్లు లీజు యజమాని పశుసంవర్ధక శాఖ నుంచి లైసెన్సు తీసుకొని వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని ఆయన తెలిపారు.

నేడు ముంపు గ్రామాల నిర్వాసితుల ధర్నా

పెద్దారవీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులతో గురువారం ఉదయం 10.30 గంటలకు ధర్నా నిర్వహించనున్నట్లు మార్కాపురం డివిజనల్ రైతు సంఘ కమిటీ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య బుధవారం తెలిపారు. సోమయ్య మాట్లాడుతూ పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు బడ్జెట్లో కేటాయించాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వెంటనే చెల్లించాలని, మొదటి సొరంగం ద్వారా నీటిని విడుదల చేయాలని, ధర్నా అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం తహసీల్దార్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముంపు గ్రామాల రైతులు, యువతీ, యువకులు, అన్ని తరగతుల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి



తాళ్లూరు: మాట్లాడుతున్న ఏవో ప్రసాద్‌రావు

దొనకొండ: రైతులు ఆరుగాలం కష్టపడి ఎండనక, వాన అనక పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సాగు చేసిన మిర్చికి వేలకు వేలు ఖర్చు చేసి గిట్టుబాటు ధర లేక అప్పుల బాధల్లో రైతులు కూరుకు పోయారన్నారు. పండించిన పంటను ఇంటికి చేర్చుకోవాలనుకుంటే కూలి రేట్లు విపరీతంగా పెరిగాయన్నారు. ఈ ఏడాది గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి ధర పడి పోయిందన్నారు. గతంలో గిట్టుబాటు ధర లభించిందని, నేడు ధర పడిపోవటంతో రైతులు ఆందోళనకు గురయ్యారన్నారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులను పట్టించుకునే నాథుడే కనుమరుగయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు.

దళారులతో ఇబ్బందులు

పండించిన పంటకు దళారులు వ్యవస్థతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని కృష్ణారెడ్డి విచారం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షపాతి అని, ప్రజల కష్ట సుఖాలు ఆయనకు తెలుసని, మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతుంటే గుంటూరు మిర్చి యార్డులో రైతులను పరామర్శించారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ పరిపాలన ఉన్నప్పుడు రైతులకు, బడుగు బలహీన వర్గాలకు ఇబ్బందులు లేకుండా చేశారని కృష్ణారెడ్డి గుర్తు చేశారు.

వేరుశనగలో పొటాషియం లోపం నివారించాలి

తాళ్లూరు: వేరుశనగలో పొటాషియంతో మొక్కకు బలం చేకూరి రోగ నిరోధక శక్తి పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లూరు 1, 2 రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాజమాన్యంలో భాగంగా మొక్కల మీద పొటాష్ లోపం క్షణాలు కనిపించినప్పుడు 10 గ్రాముల న్యూ రేట్ ఆఫ్ పొటాషియం లీటర్ నీటిలో కరిగించి ఎకరానికి సుమారు 200 నుంచి 250 లీటర్ల ద్రావణం ఆకులపై పిచికారీ చేయాలని సూచించారు. ఈ విధంగా రెండు మూడు సార్లు 10 నుంచి 15 రోజులు ఆకులపై పిచికారీ చేయాలన్నారు. మంచి ఆదాయాన్ని ఇచ్చే వేరుశనగ మన నేలకు అనువైందని, అడవి పందుల నుంచి రక్షించుకోవాలని చెప్పారు. వీఏఏలు నాగరాజు నాయక్, వెంకట్రావు, రైతులు పాల్గొన్నారు.

రైతు విశిష్ట సంఖ్యతో బహుళ ప్రయోజనాలు

దొనకొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు సేవా కేంద్రాల్లో రైతులకు అగ్రిస్టాక్ వెబ్‌సైట్ ద్వారా రైతులకు ఇస్తున్న విశిష్ట సంఖ్యతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగినపూడి రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగు పొలం ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్యను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ రాయితీ విత్తనాలు, సున్నా వడ్డీ, పంట రుణాలు తదితర వాటికి విశిష్ట సంఖ్య తప్పని సరన్నారు. అనంతరం రుద్రసముద్రంలో రైతులకు విశిష్ట సంఖ్యపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఏఓ లక్ష్మీనారాయణ